డిప్యూటీ సిఎంను కలిసిన జెసి

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను ఆయన నివాసంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు కలిశారు. జిల్లా జెసిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గోవిందరావు మర్యాదపూర్వకంగా రాజన్నదొరను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో గోవిందరావు పార్వతీపురం ఆర్డీవో గా పనిచేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న సమగ్ర సర్వే, ఇతర రెవిన్యూ సమస్యలపై ఇరువురు చర్చించుకున్నారు.

రాజన్నదొరకు పూలమొక్కను అందజేస్తున్న జెసి గోవిందరావు

రైళ్ల రద్దుతో స్టేషన్ బయట పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

స్వల్పగాయాలతో బయటపడ్డ లోకేష్ కుటుంబీకులు

ఊపిరిపీల్చుకున్న జిల్లా వాసులు

- పలు రైళ్ల రద్దుతో తప్పని నిరీక్షణ
- తాగునీటి కోసం అల్లాడిన ప్రయాణికులు
- రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట, పార్వతీపురం

ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లాలో జరిగిన రైళ్ల ప్రమాద మృతుల్లో ఉమ్మడి జిల్లాల వాసులెవరూ లేకపోవడంతో జిల్లా అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన రెండు రైళ్లలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌రైలు హౌరా నుంచి విజయనగరం మీదుగా చెన్నై వెళ్లనుండగా, యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ విజయనగరం మీదుగా హౌరా వెళు న్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదం జరగడంతో జిల్లాకు చెందిన ప్రయాణికులు ఉన్నారేమోనని అంతా ఆందోళన చెందారు. ప్రమాదం విషయం తెలుసుకొని అధికారులు ఆరా తీశారు. మృతుల్లో ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ప్రమాదం నేపథ్యంలో విజయనగరం మీదుగా ఒడిశా వైపు వెళ్లే పలు రైళ్లను రైల్వే అధికారులు రద్దు చేయడంతో విజయనగరం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓవైపు ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిపోతూ తాగునీటి కోసం పడరాని పాట్లు పడ్డారు. ఒడిశాలోని స్వగ్రామాలకు, వివిధ పనులపై వెళ్లేందుకు విజయనగరం స్టేషన్‌లో నిరీక్షించారు. రద్దయిన వాటిలో 12864 యశ్వంత్‌పూర్ -హౌరా, 12839 హౌరా మెయిల్ చెన్నై, 12703 హౌరా-సికింద్రాబాద్ (ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్), 12509 బెంగళూరు-గౌహతి, 18046 హైదరాబాద్ షాలిమార్ (ఈస్ట్ కోస్ట్)రైళ్లు ఉన్నాయి.

విజయనగరం మీదుగా పలు రైళ్లను భువనేశ్వర్ వరకు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 30రైళ్లను టిట్లాగర్, జార్జ్‌గూడ్, కటక్, అంగోర్, సంబల్పూర్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. రైలు ప్రమాద బాధితుల సమాచారం తెలుసుకునేందుకు, ప్రతి సమాచారాన్ని అందించేందుకు స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్‌లు 08922 83331, 2,3,4, 08922 221202, 221206 పోన్ నెంబర్లతో ఏర్పాటు చేసినట్లు స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఇక్కడ సిటిఐ బి.గణపతిరాజు, సీనియర్ టిసి ఆర్‌కె షాను, సిటిఐలు పి .సూర్యారావు, బిఎస్ రావు, ఎం.సంతోషి ఎప్పటికప్పుడు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

కలెక్టరేట్ : ఒడిషాలో జరిగిన రైలు ప్రమాదం సమాచారం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. సమాచారం కొరకు 08963 293046 కు ఫోన్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సమాచారం తెలిసిన వారు అందించాలని ఆయన కోరారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం లలో కూడా హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు.

స్వల్ప గాయాలతో బయటపడ్డాం

సీతంపేట : ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కొత్త పనుకువలసకు చెందిన కాదూరి లోకేష్, ఆయన తల్లి అక్కమ్మ, భార్య విన్ని, పిల్లలు హేమంత్, కరిష్మా స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరంతా కోల్‌కత్తా నుంచి కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వస్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది. తామంతా బి-5 ఎసి బోగీలో ప్రయాణిస్తున్నామని, ఒక్కసారిగా బోగీలు పల్టీలు కొట్టాయని, తమ బోగీ మాత్రం కుదుపునకు గురైందని తెలిపారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలై తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకొని ప్రాణాలతో బతికి బయట పడ్డామని తెలిపారు. ఆ సమయంలో ఎంతో భయాందోళనలకు గురైనట్లు తెలిపారు. ఈ ఘటనలో లోకేష్ కాలికి చిన్నగాయం తగలగా, ఆయన భార్య విన్నీ తలకు, నడుముకు, కాలికి గాయం కావడంతో ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక రైలులో రైల్వే అధికారులు విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లోకేష్ పెద్దన్నయ్య కలకత్తాలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. వేసవి సెలవుల నిమిత్తం అక్కడికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ సంఘటనలో చిక్కుకున్నారు.

బలిజిపేటలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

అందుబాటులో విత్తనాలు : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం/బలిజిపేట

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బలిజిపేట మండలం బర్లి, సీతానగరం మండలం పెదభోగిలిలో గల రైతు భరోసా కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేసిన వరి విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు, పురుగుల మందుల వివరాలను పరిశీలించారు. విత్తనాలకు రైతుల డిమాండ్ ఎంత మేరకు ఉంది, ఎపి సీడ్స్ సరఫరా చేసిన సర్టిఫైడ్ విత్తనాలు, మార్క్ ఫెడ్ సరఫరా చేసిన ఎరువులు యూరియా, డిఎపి, పోటాషియం నిల్వలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు నమోదు చేసుకున్న వివరాలపై ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో గత ఏడాది 23 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా ప్రస్తుతం అదనంగా 4వేల క్వింటాళ్ల ఎరువులను రప్పించి 27 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ కలెక్టర్‌కు వివరించారు. స్వర్ణ, 1101 రకం విత్తనాలను ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న అర్హులైన రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలపై సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు విత్తనాల కొరత ఉండరాదని స్పష్టం చేశారు. ఆర్‌బికె ల్లో విత్తనాలు, ఎరువుల స్టాక్‌లను ప్రత్యేకంగా నిల్వలు చేయాలని, ప్రణాళికాబద్ధంగా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతు విజ్ఞాన కేంద్రం ద్వారా పంట సాగు మెళకువలు, దిగుబడి సాధించే అవకాశాలను రైతులకు అవగాహన కల్పించాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. అనంతరం కియోస్కో వినియోగం, నమోదైన రైతుల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.అప్పల రాజు, సీతానగరం ఉప తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, బలిజిపేట ఎంపిడిఒ ఎ.భానుమూర్తి, మండల వ్యవసాయ అధికారులు ఎం.శ్రావణకుమార్, ఎస్.అవినాష్, ఆర్ఐ కరుణాకర్, విఆర్ఒ కుమార స్వామి, గ్రామ సచివాలయం విఎఎలు వి.చాందినీ, సునీత , తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - సీతంపేట

మహిళలు, మహిళా సంఘాలు రుణాల ద్వారా వ్యాపారం చేసుకుంటూ ఆర్థిక స్వాలంబన ఉంటుందని డిఆర్‌డిఎ పిడి పెద్దింటి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంఎంఎస్ కార్యాల యంలో సిపిఎం సిసిలు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు 25 ఏళ్లుగా వెలుగు ద్వారా రుణాలు ఇస్తున్నప్పటికీ ఆర్థికంగా ముందుకు వెళ్లడం లేదని అన్నారు. జీవనోపాధులు మెరుగు పడేలా వైయస్సార్ క్రాంతి పథకం సిబ్బంది మహిళా సంఘాలను తయారు చేయాలన్నారు. ఉన్నతి పథకం ఆసరా వంటి పథకాలు ఉన్నప్పటికీ వారికి వ్యాపారంపై దృష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించిన మెలకువలు నేర్పాలని అన్నారు. సమావేశంలో ఎపిఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పనిముట్లు సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వాటర్ షెడ్ మేనేజ్మెంట్‌కు సంబంధించిన రైతులు ప్రభుత్వం అందించిన వ్యవసాయ పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ కోరారు. మండలంలోని లక్కగూడలో శనివారం గిరిజన వాటర్ షెడ్ మేనేజ్మెంట్ రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కంపోనెంట్ ప్రధాన మంత్రి సించాయి యోజన 2.0. గుమ్మలక్ష్మీపురం ప్రాజెక్ట్, గుమ్మలక్ష్మీపురం మండలం పరిధిలోని 10 పంచాయతీలకు 7 మైక్రో వాటర్ షెడ్స్‌లో పిఎస్ఐ (15%) లో భాగంగా రూ.1.59 కోట్ల గానూ సుమారుగా రూ.72 లక్షలతో వాటర్ షెడ్ రైతులకు అవసరమైన 1046 యూనిట్లను 90శాతం సబ్సిడీతో మంజూరైనట్లు చెప్పారు. వాటర్ షెడ్‌లో జరుగుతున్న పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహజ వనరుల యాజమాన్యం కింద జరుగుతున్న పనులను(పెరకొలేషన్ ట్యాంక్ - ఊతకుంటలు) పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సాల్మన్ రాజు, వాటర్ షెడ్ ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ అధికారి రెడ్డి పోలినాయుడు తదితరులు ఉన్నారు.

పార్క్ పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

పర్యాటక పనులు పరిశీలన

మండలంలోని ఎల్విన్ పేట పంచాయతీ సవర కోటపాడు ఉద్యానవన ఫల శిక్షణ కేంద్రంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులను పిఒ విష్ణుచరణ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో జరుగుతున్న బోటు షికారు చెరువులు, చిన్నపిల్లల పార్క్ పనులు పరిశీలించారు. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న అతిథి గృహ సముదాయాల పనులు వేగవంతం కావాలని సూచించారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు అన్ని సౌకర్యాలు అందు బాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. కార్యక్రమం లో ఐటిడిఎ ఇంజనీరింగ్ ఇఇ శాంతిశ్వరరావు, భద్రగిరి డిఇ సింహాచలం తదితరులు ఉన్నారు.

ఎంఇఒపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి.కృష్ణమూర్తిపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న వీరఘట్టం మండలం రేగులపాడులోని కెజిబివిని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సందర్శించినప్పుడు 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని నెపంతో ఎంఇఒ పి.కృష్ణమూర్తిని సస్పెండ్ చేసినట్లు పాఠకులకు తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం బొండపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రధాన ఉపాధ్యాయులుగా బదిలీ చేస్తూ ఉత్వరులు జారీ అయ్యాయి.

సీతానగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది, చిన్నారులు

ఘనంగా ప్రపంచ సైకిల్ డే

ప్రజాశక్తి- సీతానగరం

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి. ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ సైకిల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వల్ల రోగ నిరోధక శక్తిని పెంచడంలో సమయపడుతుందన్నారు. క్రమం తప్పకుండా సైక్లింగ్ చెయ్యడం వల్ల మధుమేహం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలను దూరంగా ఉంచడంలో సహాయ పడుతుందన్నారు. కొవ్వు వేగంగా కరగడం వల్ల శరీరంలో బరువును కూడా వేగంగా తగ్గించుకోవచ్చున్నారు. దాదాపు 45 నుంచి 60 నిమిషాల సైక్లింగ్ చేయడం వల్ల 300 కేలరీలు ఖర్చవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవానీ, 104 సిబ్బంది, దుర్గాప్రసాద్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఇగా లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం

విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ముప్వల లక్ష్మణరావు నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఎస్ఇగా విధులు నిర్వహించిన పి.నాగేశ్వరరావు స్థానంలో కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్ గా విధులు నిర్వహించిన లక్ష్మణరావు ఎస్ఇగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి, విద్యుత్ శాఖ సిబ్బంది, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

కెజిబివిలో బదిలీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల 11 కస్తురిభా గాంధీ బాలిక విద్యాలయాలు, పాత శ్రీకాకుళంలోని 3 కెజిబివిలో పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి బదిలీల ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. విజయనగరం జిల్లా, శ్రీకాకుళం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాల్లో రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ చేయదలచిన అభ్యర్థులు దరఖాస్తులను జూన్ 5, నుండి జూన్ 7 వరకు కార్యాలయపు పనివేళలు సమర్పించాలన్నారు. మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరు సమగ్ర శిక్ష కార్యాలయానికి హాజరు కావాలన్నారు. ఏమైన మార్పులు వున్న యడల పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తామన్నారు.

పూతిక వలస- కురుపాం రహదారిపై సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పూతికవలస రహదారిపై ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం సమీపాన గల పూతికవలస రహదారిపై శనివారం ఉదయం నుంచి ఏనుగులు గుంపు సంచరిస్తుంది. దీంతో రహదారి మీదగా వెళ్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వివిధ అవసరాల నిమిత్తం వెళ్లాల్సిన గ్రామస్తులు, పొలాలకు వెళ్లాల్సిన రైతులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏం చేస్తాయో తెలియక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగుల గుంపు తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. తామంతా రైతు కుటుంబాలమేననీ వ్యవసాయమే తమకు జీవనాధారమని ఎప్పుడూ పొలాల్లో ఉంటామని అటువంటిది పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎటువైపు నుండి ఏనుగులు వచ్చి ఏం చేస్తాయో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి పరిస్థితి వస్తుందన్నారు. కావున అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల బారి నుంచి తమ ప్రాణాలను, పంటలను కాపాడి జనజీవనానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

సరోజినీ దామోదర్ ఫౌండేషన్ విద్యాధన్ స్కాలర్ షిప్ ప్రోగ్రామ్ ద్వారా ఆర్థికంగా వెనకబడిన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల విద్యను అభ్యసించడానికి, ఎంపిక ప్రక్రియ ద్వారా 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు స్కాలర్షిప్ అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులు రెండు సంవత్సరాల పాటు ఫౌండేషన్ నుంచి స్కాలర్షిప్ పొందుతారు. విద్యార్థి యొక్క ప్రతిభను ఆధారంగా నచ్చిన రంగంలో డిగ్రీ చదవడానికి స్కాలర్షిప్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023 విద్యా సంవత్సరంలో ఇంటర్ చదువకోవాడనికి రూ. 10వేలు, 2024 విద్యా సంవత్సరంలో 12వ తరగతి చదవడానికి రూ. 10వేలు స్కాలర్షిప్ పొందవచ్చున న్నారు. విద్యార్థుల కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.2 లక్షల లోపు ఉన్నవారు, 2022 - 23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్ చదువుతున్న వారు, టెన్త్ క్లాసులో కనీసం 90శాతం జిపిఎ సాధించిన వారు, దివ్యాంగులకు 75శాతం ఉన్నవారు, అర్హులని ఆయన చెప్పారు. అర్హులైన వారు ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడతారని చెప్పారు. దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 15 ఆఖరి తేదీ అని చెప్పారు. అర్హత గల విద్యార్థులు స్కాలర్షిప్ కోసం దరఖాస్తు www.Vidyadhan.org, విద్యాధన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

యాంత్రీకరణను రైతులు అందుకునేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాలం మారుతోంది. మనుషులు, పశువులు చేయాల్సిన పని ప్రస్తుతం యంత్రాలతో చేపట్టే టెక్నాలజీ వచ్చింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో, పూర్వం నుంచీ సాగులో ఉపయోగించే నాగలి, నక్కు, మేడు, వాటిని లాగేందుకు కాడెద్దులు కనిపించడం లేదు. వాటి స్థానంలో ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు వంటివి వచ్చాయి. గడిచిన దశాబ్ద కాలంలో మరో అడుగు ముందుకు పడింది. కలుపు మొక్కలు, వరికోత, నూర్పిడి యంత్రాలు వంటివి అందుబాటులోకి వచ్చాయి. ఈ ఆధునిక వ్యవసాయ యంత్రాల వల్ల సకాలంలో పనులు జరగడంతోపాటు రైతులకు యాతన తగ్గింది. కానీ, వీటిని అందుకునే పరిస్థితుల్లో రైతులు లేరు. ముఖ్యంగా మన జిల్లాలో ఎక్కువ మంది సన్నచిన్నకారు రైతులే ఉన్నారు. భూకమతాలు కూడా చిన్నచిన్నవిగా ఉండడంతో నాగలి, ఎడ్ల సాయంతో పూర్వం నుంచి సాగుపద్ధతి అమలవుతోంది. కానీ, ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినందుకు సంబరపడాలో బాధపడాలో తెలియని పరిస్థితి. ఇందుకు కారణం లేకపోలేదు. మారిన టెక్నాలజీని రైతులు అందుబాటు లేకపోవడమే ఇందుకు కారణం. దీంతో, వ్యవసాయ యంత్ర పరికరాలు కేవలం ధనిక రైతులు, ఆర్థికంగా కాస్త అవకాశం ఉన్నవారికే పరిమితమౌతున్నాయి. యంత్ర సేవ పథకంలో భాగంగా ఆర్‌బికెల వారీగా సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను ప్రభుత్వం పంపిణీ చేస్తున్న విషయం విధితమే. జిల్లాలో 184 సిహెచ్‌సిలకు 505 రకాల యంత్ర పరికరాలను ప్రభుత్వం శుక్రవారం అందజేసింది. వాటి విలువ రూ.15.20 కోట్లు కాగా ఇందులో సబ్సిడీ రూపంలో రూ.4.54 కోట్లు అందించామని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. గత ఏడాది మొదటి విడత యంత్ర పరికరాల పంపిణీలో 310 గ్రూపులకు రూ.28.45 కోట్ల విలువైన పరికరాలను అందజేశారు. ఇందులో రూ.9.34కోట్లను సబ్సిడీగా అందజేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ రైతులకే చెందే విధంగా రైతు మిత్ర సంఘాలను ఏర్పాటు చేసి 40 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోంది. ఇంత వరకు బాగానే ఉన్నా మన జిల్లా రైతాంగానిది ప్రత్యేక పరిస్థితి. తగిన నీటి వసతి లేకపోవడం వల్ల ఏడాదికి ఒక్కపంట (ఖరీఫ్) మాత్రమే సాగవుతోంది. ఇది కూడా వర్షాధారంగానే. సాగునీటి వనరులు ఉన్నా వాటిని పలుకులు పట్టించుకోకపోవడంతో రైతులు వరుణుడి కరుణపైనే ఆధారపడుతున్నారు. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాలు, అమాంతంగా పెరిగిన ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ధరల వల్ల కష్టనష్టాలకు గురి కావాల్సివస్తోంది. ఫలితంగా సాగులో వ్యవసాయ యంత్రాల అద్దె చెల్లించుకోడమే కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో రూ.లక్షల విలువగల యాత్రాలను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం తరపున 40శాతం సబ్సిడీ ఉన్నప్పటికీ దాన్ని కూడా అందుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్స్ కాస్త ధనవంతులకే పరిమితమౌతున్నాయి. చాలా చోట్ల ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకరు లేదా ఇద్దరే మిగిలిన సభ్యుల పేర్లతో ఆయా యూనిట్లను పొందుతున్నారు. దీనివల్ల సభ్యులకేమీ నష్టం లేకపోయినప్పటికీ రైతుల దీనస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సబ్సిడీని పెంచడం లేదా ఆయా రైతుల భాగస్వామ్యాన్ని పెంచడం వంటివి చేస్తే తప్ప పేద రైతులు వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జనసేనలోకి వైసిపి నాయకుడు

ప్రజాశక్తి- సాలూరు

పాచిపెంట మండలానికి చెందిన వైసిపి నాయకుడు గొర్లి తిరుపతి నాయుడు జనసేనలో చేరారు. ఈ మేరకు ఆయన విజయవాడలో జనసేన రాష్ట్ర నేత నాదెండ్ల మనోహర్ని కలిశారు. పట్టణానికి చెందిన టిడిపి నాయకులు విజయ్ చేరి, గొర్లి తిరుపతి నాయుడును నాదెండ్ల మనోహర్ వద్దకు తీసుకు వెళ్ళినట్లు తెలుస్తోంది. పాచిపెంట మాజీ జెడ్పిటిసి, సీనియర్ నాయకులు గొర్లి గణపతిరావు సొంత తమ్ముడైన తిరుపతినాయుడు నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఆయనకు ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసిస్తున్న కీలక వైసిపి నేతలతో సత్సంబంధాలు వున్నాయి. తిరుపతి నాయుడు భార్య పిబి కుమారి గిరిజన కులానికి చెందిన మహిళా టీచర్. ఆమెను రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలనే వ్యూహంతో గొర్లి తిరుపతి నాయుడు పావులు కదుపుతున్నారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరకి సన్నిహితుడైన మాజీ జెడ్పిటిసి గొర్లి గణపతిరావు సోదరుడు తిరుపతి నాయుడు జనసేనలో చేరడం నియోజకవర్గ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది.

తిరుపతినాయుడును పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాదెండ్ల

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సత్యం

కంబగూడలో ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కంబగూడలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న భూ అభివృద్ధి పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం శనివారం పరిశీలించారు. మస్టర్లను పరిశీలించారు. పనులు జరిగే చోట టెంట్లు, ప్రథమ చికిత్స బాక్సులు, తాగునీరు తప్పనిసరిగా ఉండాలన్నారు. కూలి గిట్టుబాటయ్యేలా కొలతలు ఇవ్వాలని ఎపిఒ బాబురావుకు సూచించారు.

12న విత్తన మహోత్సవం

ప్రజాశక్తి -కురుపాం

ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 12న విత్తన మహోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున జరుపుతున్నట్టు ఏరువాక జిల్లా కో-ఆర్డినేటర్ కె.లక్ష్మణ్ తెలిపారు. విత్తన మహోత్సవం సందర్భంగా వివిధ రకాల పంటలకు (వరి, కంది, మినుములు, పెసర, శనగ, వేరుశనగ, నువ్వులు, రాగులు, కొర్ర, జొన్న మొ"గు) చెందిన విత్తనాలు, కొత్తగా విడుదలైన నూతన రకాలు కూడా అమ్మకానికి అందుబాటులో ఉంటాయి.. కావున పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, విస్తరణ సంచాలకులు రాష్ట్రంలోని రైతులు ఈ కార్యక్రమానికి విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మోడల్ స్కూల్లో స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మలేరియా సోకకుండా ముందు జాగ్రత్తలు

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు మలేరియా సోకకుండా ముందస్తుగా వసతి గృహాల్లో ఎసిఎం 5శాతం ద్రావణం స్ప్రేయింగ్ చేస్తున్నామని స్థానిక మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో జరుగుతున్న స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని ఆయనతో పాటు ఎంపిడిఒ వివి శివరామప్ప, ఎఇఒ ఎన్.సత్యనారాయణ పరిశీలించారు.ఈ సందర్భంగా స్ప్రేయింగ్ సిబ్బందితో మాట్లాడుతూ అన్ని గదుల్లో సక్రమంగా స్ప్రేయింగ్ చేసి సెలవులు పూర్తయినాటికి మండలంలో గల అన్ని వసతి గృహాలను పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.శ్రావణ్ కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుందరరావు, సూపర్వైజర్ కె.రాధాకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరం, ముగింపు ఉత్సవాలను శనివారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు ఎం.శంకర్రావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. హ్యాండ్ బాల్, చదరంగం, సాఫ్ట్ బాల్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కోచ్ సబ్బాన మురళిని ఈ సందర్భంగా గ్రామస్తులు అభినందించారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు తినుబండారాలు అందచేసిన విశ్రాంత ఎంఇఒ రెడ్డి రామచంద్ర, గొట్టాపు వెంకటరమణ, చుక్క విక్రాంత్‌ను ఈ సందర్భంగా కొనియాడారు.

చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ చంటిపిల్లలు, గర్భిణులు, జ్వర పీడితులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రత అధికంగా ఉన్నందున బయటకు వెళ్ళవద్దని ఒకవేళ వెళితే గొడుగు వేసుకుని బయటికి వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ శాంతకుమారి, ఏఎన్ఎం జి. పైడితల్లి, టెక్నీషియన్, ఎం ఎల్ హెచ్పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజా శక్తి- సీతంపేట

డిప్యూటీ సిఎంకు వినతినిస్తున్న ఉపాధ్యాయులు

ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ఉప ముఖ్య మంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పి.రాజన్నదొర వద్దకు తీసుకొని వెళ్లిన ఆదివాసీ జెఎసి సీతంపేట ప్రధాన కార్యదర్శి, బిడ్డిక ఉమామహేశ్వరరావు, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినిమమ్ టైమ్ స్కేల్ అమలుపర్చాలని అడగ్గా మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను మినిమమ్ టైమ్ స్కేల్, వారిని సిఆర్టిలుగా అప్‌గ్రేడ్ చేసేలా చర్యలు తీసుకొని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలానే బోయ, వాల్మీకి, శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియాలమని చెప్పుకుంటున్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్టిజాబితాలో చేర్చ కుండా కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని, వారిని మన ఆదివాసీ తెగలో కలపకుండా చేస్తామని, ఆదివాసీ మనుగడను, అభివద్ధిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలిసి కట్టుగా ముందుకు పోవాలని కోరారు.

ఆంగ్లభాష నైపుణ్యతపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాలలో సోమవారం నుంచి నెలరోజుల పాటు బ్యాచులవారీగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆంగ్లభాష పరిజ్ఞాననైపుణ్యంను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు ఆంగ్లంలో బోధనా నైపుణ్యత పెంచేందుకు, ఇంగ్లీష్ స్కిల్స్ అధ్యాపకులలో పెంచేందుకు రాష్ట్రస్థాయిలో 18నోడల్ రిసోర్స్ సెంటర్లలో ఈశిక్షణ తరగతులు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ అధ్యాపకులను, పిడీలను, లైబ్రరియన్లకు శిక్షణా తరగతుల నుండి మినహాయింపు ఇస్తున్నామన్నారు.

ఈ శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని విజయవాడ ఎస్ఆర్ఆర్అండ్సిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ ఈనెల 5న(సోమవారం) ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మొదటి బ్యాచ్‌లో రెండు జిల్లాలోని 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 49 మంది అధ్యాపకులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈశిక్షణ తరగతులకు కోర్సు కో-ఆర్డినేటరుగా కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకులు బి.శాంతకుమారి వ్యవహరిస్తారని చెప్పారు. సాలూరు, రాజాం, విజయనగరం, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన నలుగురు అధ్యాపకులు మాస్టర్ ట్రైనర్లుగా ఉంటారని తెలిపారు. శిక్షణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశామని చెప్పారు. శిక్షణను ఆన్లైన్ ద్వారా కొన్ని అంశాలపై నిపుణులు శిక్షణ తరగతులను నిర్వహిస్తారని, మరికొన్ని అంశాలపై మాస్టర్ ట్రైనర్లుగా నియమించబడిన నలుగురు అధ్యాపకులు శిక్షణ ఇస్తారని తెలిపారు. స్థానిక నోడల్ కేంద్రమైన ప్రభుత్వ శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో పార్వతీపురం, జియల్ పురం, వీరఘట్టం, పాలకొండ, సాలూరు, సీతంపేట, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి, విజయనగరంలోని (రెండు) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

నినాదాలు చేస్తున్న కూలీలు, నాయకులు

మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు మంచినీరు, నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొద్ద సోములు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని మంచాడవలస ఉపాధి కూలీ పనులను శనివారం వారు పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కూలీలు ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మండుటెండలో పనిచేస్తున్నారని ప్రత్యేకించి మంచినీరు, మజ్జిగ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉపాధి చట్టాల్లో బడ్జెట్ కేటాయింపులు పెంచి సౌకర్యాలు పెంచాలని గిట్టుబాటు కూలి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. చట్టాన్ని నిర్వీర్యం చేసే ఆలోచన ప్రభుత్వం మానుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేకపోవడం వల్ల చదువుకున్న యువతీ యువకులు ఉపాధి హామీ పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారని అటువంటి ఉపాధి హామీని సక్రమంగా అమలు చేసే బాధ్యత ప్రభుత్వాలకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాంబ, తోరిక తౌడు, సంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సీతంపేట

ఈ విద్యా సంవత్సరానికి ఎన్ఎంఎంఎస్ జాతీయస్థాయి ప్రతిభా పరీక్షలో సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.ప్రియమణి, అంజూరు ప్రణీత, దూబ శరణ్య స్కాలర్‌షిప్‌నకు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తెలిపారు. వీరికి ప్రభుత్వం తరపున నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేలు ప్రతిభా పురస్కారం అందుతుంది. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిబ్బంది, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నిమ్మక కాంతారావు, ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారి సోన్యా విద్యార్థులను అభినందించారు.

భామిని : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ టెస్ట్‌లో స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన టి.చరణ్య, గుర్జాపు కరుణశ్రీ, నిమ్మల ప్రణవి, గౌడు జీతూ, గౌడు జగదీశ్, కొల్ల చంద్రిక ఎంపికయ్యినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. ఎంపిక కాబడిన విద్యార్థులకు స్కూల్ చైర్మన్ నిమ్మల కుమారి, వైస్ చైర్మన్ శాంత్రో సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

భామిని: ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

16,17 తేదీల్లో గిరిజన సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాంలో ఈనెల 16,17న గిరిజన సంఘం 7వ జిల్లా మహాసభలు జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు యు.వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం కొమరాడ మండలం దేవకొన పంచాయతీ అంటివలసలో గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మహాసభకు సంబంధించిన గోడ పత్రికలు పట్టుకొని గ్రామంలో ప్రచారం ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ గిరిజన హక్కులను, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎత్తివేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఇంకా కొన్ని తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కావున ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజనులు లక్ష్మమ్మ, మంగమ్మ, సుబ్బారావు, సత్యారావు, సన్యాసిరావు, రామారావు, ప్రసాదు, వెంకటేశు, లక్ష్మణరావు, గిరిజనులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

చెరువుల్లో అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పట్టణానికి అనుకొని ఉన్న చెరువుల్లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు, సత్య సింహ చక్రవర్తి, పార్వతీపురం, సీతానగరం మండలాల అధ్యక్షులు బలగ శంకర్రావు, పాటి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ జిల్లాలో దాదాపు చెరువులన్నీ కబ్జాకు గురవుతున్నాయన్నారు. పార్వతీపురం పట్టణంలోని ఆయా చెరువులను కబ్జాదారులు దర్జాగా కబ్జా చేసి పెద్దపెద్ద భవనాలను అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. ఈ విషయమై పత్రికలు ఘోష పెడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల చెవికి ఎక్కడం లేదన్నారు. రెవెన్యూ, మున్సిపాలిటీ, సచివాలయ ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఆక్రమణదారులతో కుమ్మక్కై, కోట్లాది రూపాయలు విలువైన ప్రభుత్వ చెరువులను కానరాకుండా చేస్తున్నా చర్యలు చేపట్టడం లేదన్నారు. చెరువులు కనుమరుగైతే భావితరానికి నీటి చుక్క దొరికే పరిస్థితి ఉండదన్నారు. ఇక జలజీవరాసులు తాగునీటికై ఇబ్బందులు పడే రోజులు రానున్నాయన్నారు. పార్వతీపురం మున్సిపాలిటీలోని నెల్లిచెరువు, లంకెల చెరువు, దేవుని బంధ, కోదువాని బంధ, లక్ష్మనాయుడు చెరువు తదితర దాదాపు 40 చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. నెల్లిచెరువు, లక్ష్మి నాయుడు చెరువుల్లో పక్కా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వ చెరువుల్లో ఇల్లు కడితే వాటికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఎలా ఇస్తారో , కరెంట్ అధికారులు మీటర్లు ఏ విధంగా మంజూరు చేశాస్తారో చెప్పాలన్నారు. అలాగే చెరువులను కబ్జా చేసి పక్కా భవనాలు నిర్మిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని, భవనాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు కనీసం పట్టకపోవడం బాధాకరమన్నారు.

రైల్వేశాఖా మంత్రి రాజీనామా చేయాలి

పార్వతీపురంటౌన్: పాలకుల వినాశకర విధానాల ఫలితమే రైల్వే ప్రమాదాలకు కారణమని, ఈ ప్రమాదాల కారణమైన రైల్వే ప్రైవేటీరకరణను కేంద్ర ప్రభుత్వం ఆపాలని, తక్షణమే రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి డి.వర్మ ఒక ప్రకటన పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో ఇప్పటికే 290మందికిపైగా మృతి చెందగా, వెయ్యి మందికి పైగా తీవ్ర గాయాలు పాలైనట్లు తెలుస్తుందన్నారు. ఈ ప్రమాద తీవ్రతతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తుందన్నారు. వెంటనే ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నాలుగేళ్లలోనే దేశ వ్యాప్తంగా 422 ప్రమాదాలు జరిగాయని, వీటిలో ఎక్కువ శాతం ట్రాక్ నిర్వహణ, సిగ్నలింగ్ లోపాల వల్లేనని, ట్రాక్‌ల పరిస్థితి నిరంతరం పర్యవేక్షించే 'గ్యాంగ్ మెన్' వంటి కింది స్థాయి సిబ్బంది కొరత, తీవ్రంగా వేధిస్తున్నదని చెప్పారు. ఉద్యోగ భద్రత లేమి, నిరంతరం ట్రాక్‌ను పర్యవేక్షించడానికి అవసరమైన వాహనాల కొరతే కాగ్ స్పష్టం చేస్తుందన్నారు. ఈ ప్రమాదాలకు కారణమైన కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణను ఆపాలన్నారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసే కన్నా తమ గ్రామానికి తామే రహదారి నిర్మించాలని ఆ గిరిజనులు నిర్ణయించారు. ఈ మేరకు శ్రమదానంతో కొంత నిధులతో రోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. మండలంలోని వంగర గ్రామ పంచాయతీలో ఒడిశా సరిహద్దులో ఆనుకొని ఉన్న మర్రిగూడ గిరిజన గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఆ గ్రామ ప్రజల బాధలు వర్ణతీతం. దీంతో గ్రామస్తులంత ఏకమై రూ.60 వేలు పోగుచేసి జెసిబి, ట్రాక్టర్ సాయంతో మెటల్ కంకర వేసి రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.7.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించిన టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదని తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం పలుమార్లు ఐటిడిఎ అధికారులను కోరిన స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద కేదారిపురం నుంచి మర్రిగూడ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ తులసమ్మ, గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు వేసుకుంటున్న గిరిజనలు

కాలుష్య నివారణకు కృషి

చీపురుపల్లి: కాలుష్య నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం మూడు రోడ్ల జంక్షన్ నుండి జివిఆర్ కాలేజ్ వరకు జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ప్రారంభించారు. ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ జనరల్ ఆసెంబ్లీ జూన్ 3 తేదీన ప్రపంచ సైకిల్ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో చీలకయ్య, ఆశయ సంస్థ సభ్యులు చంటి పాల్గొన్నారు.

చిన్నారి కేన్సర్ చికిత్సకు సిఎం సహాయం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కందిశ గ్రామానికి చెందిన పొన్నగంటి లావణ్య, కన్నబాబుల కుమార్తె హేమలత కేన్సర్‌తో బాధపడుతుంది. వావిలవలసకు చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిగూడెం లో కలిసి ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సిఎం రూ. లక్షతో పాటు హేమలతకు హాస్పిటల్ వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద ప్రతి నెలా ఆస్పత్రిలో జమ చేసేందుకు రూ. 38వేలు ఇవ్వనున్నట్లు అంగీకరించారు.

రజకుల స్థలాలపై పెత్తందారుల దౌర్జన్యం ఆపాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

రజకుల స్థలాల పై పెత్తం దారుల దౌర్జన్యం ఆపాలని సిపిఐఎంఎల్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పి భాస్కరరావు డిమాండ్ చేశారు. శనివారం మేజర్ పంచాయతీ రెండో వార్డు పరిధిలో గల రజకుల స్థలాలను పరిశీలించిన ఆయన మాట్లాడారు. గుర్రాల గౌరీ శంకర్, గుర్రాల తవిటమ్మ, నకిరాపు సూరమ్మల వద్ద 1998 నుంచి ఉంటున్న ఇళ్ల స్థలాలను ఇదే గ్రామానికి చెందిన వ్యాపారి ఈ స్థలం తనదంటూ దౌర్జన్యానికి పాలపడుతున్నాడని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకుని రజకలకు న్యాయం చేయాలని కోరారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 27వ రోజు ఎక్కువ మంది పిల్లలు పాల్గొన్నారు. శనివారం డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి కృష్ణ పిల్లలకు కార్టూన్, పెయింటింగ్‌లు ఎలా వేయాలో విద్యార్థులకు నేర్పించారు. ఆదివారం విద్యార్థులు నెట్ క్లాత్ తీసుకొని వస్తే పిల్లలకు వాటితో పువ్వులు, కొన్ని బొమ్మలు ఎలా తయారు చేయాలో కళా అంకురం ఫ్యాషన్ డిజైనర్ డైరెక్టర్ అల్లు ప్రియాంక నేర్పిస్తారని గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు తెలిపారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో కోదండ రామాలయ ప్రతిష్ట, ప్రారంభం వైభవపేత్తంగా శనివారం జరిగింది. ఉదయం నుంచే గ్రామ పెద్దలతో పాటు ప్రజలు రామాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల చేత కళ్యాణం కూడా జరిపించారు. రామాలయ ప్రతిష్ట, ఆలయాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర రావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నెల్లిమర్ల జెడ్పిటిసి గదల సన్యాసినాయుడు, ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, పిఎసిఎస్ చైర్మన రొంగలి కనక సింహాచలం, నాయకులు చనమల్లు వెంకటరమణ, మహంతి శ్రీనివాసరావు, అంబళ్ల శ్రీరాముల నాయుడు రామాలయాన్ని సందర్శించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. అనంతరం గ్రామంలో 4వేల మందికి అన్నదానం చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజనిగిరి చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, మాజీ ఎంపిటిసి కొర్నాన ఆదిబాబు, మాజీ సర్పంచ్ వెంకట్రావు పాల్గొన్నారు

క్రీడాకారుడు మౌళిని అంభినందిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - సాలూరు

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి పతకాలు సాధించిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర చెప్పారు. శనివారం పట్టణంలోని చిట్లువీధికి బర్లి రామకృష్ణ కుమారుడు మౌళి ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా ఆయన నివాసంలో కలిశారు. డిప్యూటీ సిఎంను మౌళిని అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అలాంటి క్రీడాకారులకు తన సహకారం ఎల్లప్పుడూ వుంటుందని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లోనూ యువకులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, సామాజిక కార్యకర్త కోడూరు సాయి శ్రీనివాసరావు వున్నారు.

రోగి వద్దకు వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో గల గాంధీనగర్ కాలనీకి చెందిన కమిడి నీలయ్య అనారోగ్యంతో బాధపడతు శ్రీకాకుళం జిల్లా రాగోలు జేమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఇంటికి రాలేని స్థితిలో ఉన్నారు. దీంతో వాలంటీరు కె.సుమాంజలి ఆసుపత్రి వద్దకు వెళ్లి నీలయ్య పెన్షన్ అందజేసింది. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

బలిజిపేట: మండలంలోని అరసాడకు చెందిన గంట నారాయణమ్మ కేన్సర్‌తో కొంత కాలంగా బాధ పడుతోంది. విశాఖపట్నం లో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈమెకు వాలంటీర్ పి.లక్ష్మి ఆసుపత్రికి వెళ్లి వైస్సార్ పింఛను కానుక అందజేశారు. ఈ విషయంపై లబ్ధిదారుని కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ అందిస్తున్న వాలంటీర్

కొనసాగుతున్న గడపగడపకు...

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని తాళ్లబురిడిలో రెండో రోజు శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో కొనసాగింది. మండల అధికారులతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను కరపత్రాల రూపంలో అందిస్తూ, సుస్థిర పాలన అందిస్తున్న వైసిపికే భవిష్యత్తులో మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు మర్రాపు లక్ష్మి, వాసుదేవరావు, కన్వీనర్ బొమ్మి రమేష్, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పులిగుమ్మిలో నవధాన్య విత్తన కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని పులిగుమ్మిలో సర్పంచ్ బేత బాలకుమారి ఆధ్వర్యంలో శనివారం రైతులకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన నవధాన్య విత్తన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోతున్న ఖరీఫ్ సీజన్‌కు ముందుగా పంట పొలాల్లో నవధాన్య విత్తనాలను వెదజల్లి, నెల రోజుల్లో వచ్చిన మొక్కలకు నాట్లు వేసుకునే మందు దుక్కిలో కలియ దున్నితే పంటకు అవసరమైనంత నత్రజని పోషక విలువలతో కూడుకున్న బలం లభిస్తుందని తెలియచేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- పాలకొండ

మండలంలోని అన్నవరం ప్రాంతంలో సినిమా థియేటర్ ఎదురుగా శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొండ పట్టణం బల్లంకివీధికి చెందిన బొద్దాన లక్ష్మి(51) మృతి చెందింది. ఇంటి నుంచి సినిమా థియేటర్ జంక్షన్‌కు పనిమీద వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మతి చెందింది. ఆమె భర్త అప్పన్న కూలి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని చిన్నారి మృతి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆర్‌టిసి బస్సు ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన పార్వతీపురంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, మెయిన్ రోడ్డు కన్యకా పరమేశ్వరి గుడి ఎదురుగా టివిఎస్ ఎక్స్ఎల్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో వాహనం నడుపుతున్న వృద్ధునికి గాయాలు కాగా, వెనుక కూర్చొన్న అతని మనవడు సొండి హర్షత్ ఓఫీ (3) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై విచారణ చేపడుతున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

మృతు చెందిన హర్షిత్